క్లుప్తంగా

మహాకాళేశ్వరాలయ తృతీయ వార్షికోత్సవం



యాగశాల ప్రారంభానికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్న దండుమేను వెంకట సుబ్బారావు దంపతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇన్నీస్‌పేటలోని మహాకాళేశ్వరాలయ (మరో ఉజ్జయిని) తృతీయ వార్షికోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. రోటరీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పట్టపగలు వెంకటరావు రెండో అల్లుడు దండుమేను వెంకట సుబ్బారావు, బాల మాలతీదేవి దంపతులు యాగశాల ప్రారంభానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆదివారం సీతారాముల కల్యాణం, హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల కమిటీ తెలిపింది.

11న రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సమరభేరి

సీటీఆర్ఐ: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బీసీ సమరభేరి పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మాపు చిత్రసేను వెల్లడించారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద మహాధర్నాలు నిర్వహిస్తామన్నారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, జిల్లా ఇన్‌చార్జి పరమట గణేశ్వరరావుతో కలిసి ఆయన బీసీ సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మునీంద్ర, కొల్లాపు శ్రీను, కొడవర్తి సూరిబాబు, నక్కా వెంకట రత్నంరాజు, కొల్లాటి అబ్బులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ కేసులపై అధికారుల నిర్లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ: అనపర్తి నియోజకవర్గంలోని బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల విషయంలో ప్రభుత్వ ఆరోగ్యశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ గ్రామంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఎందుకు వస్తున్నాయో ఆరోగ్యశాఖాధికారులు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందనే అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కడియం: స్థానిక దేవీచౌక్ సెంటర్‌లో మర్రి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ శనివారం ప్రారంభించారు. గత 14 సంవత్సరాలుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణీకుల దాహార్తిని తీరుస్తున్న శంకర్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

రాజమహేంద్రవరం రూరల్/రాజానగరం: రాజానగరం మండలం రఘునాథపురం గ్రామంలో శనివారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలికి తాటిచెట్టు పడి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. అదే సమయంలో కవలగొయ్యి గ్రామానికి చెందిన పంచకట్ల సూరిబాబు గడ్డి మోపుతో మోపెడ్‌పై వెళుతుండగా విద్యుత్ స్తంభం పడింది. మోపెడ్ ముందుభాగంపై స్తంభం పడడంతో పెనుప్రమాదం తప్పింది. అదృష్టవశాత్తూ సూరిబాబుకు ఎటువంటి గాయాలు కాలేదు. విద్యుత్ శాఖ ఏఈ సత్యప్రసాద్ సంఘటన స్థలానికి వెళ్లి విద్యుత్ స్తంభాన్ని పక్కకు తొలగించారు.

రేపటి నుంచి ఆక్వా జోన్ల గ్రామ సభలు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో ఆక్వా జోన్ల ఏర్పాటుపై సోమవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కె.ప్రకాశరావు తెలిపారు. ఆయన పెదపూడిలో శనివారం మాట్లాడుతూ 7న ఏపీత్రయం, దోమాడ, జి.మామిడాడ, కాండ్రేగుల గ్రామాల్లో, 8న కరకుదురు, రాజుపాలెం, కైకవోలు, పెదపూడిలో, 9న పుట్టకొండ, వేండ్ర, పెద్దాడ, పైన గ్రామాల్లో, 11న శహపురం, సంపర, గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు.

వైఫల్యాలతో కుంగిపోవద్దు

రాజానగరం: జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలతో కుంగిపోకుండా, వాటినే అవకాశంగా తీసుకుని ప్రయత్నాన్ని కొనసాగిస్తే విజయాలను సొంతం చేసుకోవచ్చని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రొ వీసీ డాక్టర్ కేవీబీ రాజు అన్నారు. క్యాంపస్‌లోని వివిధ కళాశాలల అధ్యాపకులకు 'సక్సెస్ మంత్ర' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణను అభివృద్ధి చేసుకుంటూ ఆత్మస్థైర్యంతో పని చేసి, విజయపథంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ టీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం

- ముస్తాబైన రామాలయాలు
- నేడు శ్రీరామ నవమి వేడుకలు



సీతంపేటలో కొలువైన సీతారామలక్ష్మణులు



సీతంపేట రామాలయం వద్ద సీతారాముల కల్యాణానికి ఏర్పాటు చేసిన వేదిక

సీటీఆర్ఐ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విశ్వావసు నామ సంవత్సర చైత్రమాస శుద్ధ నవమి ఆదివారం స్వామివారి కల్యాణం జరగనుంది. సీతంపేటలోని 170 ఏళ్ల చరిత్ర కలిగిన సీతారామాలయంలో ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం జరపనున్నారు. వచ్చే భక్తులందరి కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. వైఖానస ఆగమ పద్ధతిలో జరిగే ఈ కల్యాణ ప్రక్రియను తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరవుతారని ఆలయ అర్చకుడు వై.శ్రీనివాసాచార్యులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు బెల్లం పానకం, వడపప్పు ఇతర ప్రసాద వితరణ జరుగుతుంది. నవమి ఉత్సవాల పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం స్వామివారి శాంతి కల్యాణం, సాయంత్రం సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతారు.

- జాంపేట పోలీసు క్వార్టర్స్‌లోని కోదండ రామాలయం, దేవీచౌక్‌లోని సీతారామ, లక్ష్మణ, హనుమ సమేత ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. రామాలయాలే కాకుండా హనుమంతుడి ఆలయాల్లో కూడా శ్రీరామ నవమికి ఏర్పాట్లు చేశారు.

రాజమహేంద్రవరం రూరల్: శ్రీరామనవమి వేడుకలకు నియోజకవర్గంలోని సీతారామాలయాలు సిద్ధమయ్యాయి. కల్యాణ మహోత్సవం అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. .

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలక సంస్థ పరిధిలోని ఇన్నీసుపేట ప్రాంతంలో ఆరు రామాలయాలు ఉన్నాయి. రెడ్డి రామాలయం, పద్మశాలీ రామాలయం, శెట్టిబలిజ రామాలయం, గొల్లల రామాలయం, వెలమల రామాలయంతో పాటు మరో రామాలయంలో కూడా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. 16వ డివిజన్ రైల్వే క్వార్టర్స్‌లోని వెంకట రామలింగేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఐదు రోజుల పాటు నిర్వహించి శుక్రవారం మహాన్న సమారాధన నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. ఆల్కాట్‌తోటలోని శ్రీరామమందిరంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

బ్యారేజీ క్వార్టర్స్‌లో..

ధవళేశ్వరం: సీతారాముల కల్యాణోత్సవానికి ధవళేశ్వరంలోని బ్యారేజీ క్వార్టర్స్ రామాలయంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 11.51 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. విశ్రాంత టెక్నికల్ అధికారి సాగి వెంకట సూర్యనారాయణరాజు, వేదవతి దంపతులు కల్యాణోత్సవ పీటలపై కూర్చోనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 నుంచి భారీ అన్నసమారాధన, పేదలకు వస్త్రదానం చేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహకవర్గం తెలిపింది. ఈ నెల 10వ తేదీన తొంటిపు వెంకటేశ్వరరావు, వీర వెంకట నాగమణి దంపతులచే శ్రీపుష్పయాగం జరుగుతుంది. అలాగే గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్, రథం వీధి, మెండా వారి వీధి, గొల్లపేట, కొత్తపేట, ఎర్రకొండ రామాలయాల వద్ద సీతారాముల కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



ఇన్నీసుపేటలోని రెడ్డి రామాలయంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలు





ధవళేశ్వరం లాక్‌లైన్ క్వార్టర్స్ రామాలయం, సీతా సమేత శ్రీరాముడు

వృద్ధులకు పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆనందా గార్డెన్స్‌లో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశ్రాంత తహసీల్దార్ చెల్లుబోయిన రాజ్యలక్ష్మి దంపతులు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ చైర్మన్ అనసూరి వెంకట శ్రీనివాస్, పల్లిప్రోలు నాగవేణి దాతలను గీసాల బాపూజీ వేదిక మీదకు ఆహ్వానించారు. అనంతరం 75 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున మొత్తం రూ.37,500 పింఛన్లుగా, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పిట్టల సాయిరామ్‌కు క్లబ్ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. వృద్ధులకు అల్పాహారాన్ని వెంకటరెడ్డి దంపతులు, మజ్జిగ, పండ్లను బెంగళూరుకు చెందిన ఆకుల లక్ష్మీదుర్గాప్రసన్న అందించారు. ముఖ్య అతిథులను క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు, భేరీ రత్నాంబ, మొగల్తూరు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అడ్మిషన్లు ప్రారంభం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్‌వీఎల్.నరసింహం శనివారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణత అయ్యే విద్యార్థులు ముందుగా వచ్చి ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఇంగ్లిషు, తెలుగు మీడియాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఒకేషనల్ విభాగంలో ఓఏ, ఏఅండ్‌టీ, సీఎస్ఈ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్), సీటీ, పీటీజీ, ఈటీ, హెచ్‌వో, ఎంఅండ్‌ఏటీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సోమవారం నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు ఫండమెంటల్స్, బ్రిడ్జి కోర్సులు బోధిస్తామన్నారు.

నిజాయితీకి నిలువుటద్దం బత్తిన సుబ్బారావు



బత్తిన సుబ్బారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న భరత్‌రామ్

- ఆయన ఆశయాల సాధనకు కృషి
- మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా ప్రతినిధిగా, మంత్రిగా నీతి నిజాయితీతో పనిచేసిన గొప్ప నాయకుడు బత్తిన సుబ్బారావు అని, ఆయన ఆశయాల సాధనకు మనమంతా కృషి చేయాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ కొనియాడారు. బత్తిన సుబ్బారావు సేవా సమితి అధ్యక్షుడు బర్రే కొండబాబు ఆధ్వర్యంలో శనివారం బత్తిన సుబ్బారావు వర్ధంతి నిర్వహించారు. క్వారీ ఏరియాలోని సుబ్బారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భరత్‌రామ్ మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉండే క్వారీ ప్రాంతంలో రోడ్డును విస్తరించి పార్లమెంట్ తరహా నిర్మాణంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా ప్రజల చేతికి డబ్బులు అందేవన్నారు. కానీ చంద్రబాబు ఏ ఒక్క పథకం కూడా అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చేయడానికి వైఎస్సార్ సీపీ ప్రజాపక్షం వహించి పోరాటం చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నక్కా శ్రీనగేష్, తిరగాటి దుర్గారావు నివాళులర్పించారు.

గోదావరిలో మట్టి, ఇసుక దోపిడీ

- ఎంపీటీసీ ఆధ్వర్యంలో పక్కా స్కెచ్
- రాత్రి వేళ యథేచ్ఛగా తవ్వకాలు



పొట్టిలంక శివార్లలో అక్రమంగా మట్టి, ఇసుకను తవ్వేసిన ప్రాంతం

కడియం: గోదావరిలో మట్టి, ఇసుకను కేటుగాళ్లు దోచేస్తున్నారు. ప్రజా ప్రతినిధుల ముసుగులో నేరుగా సహజ ప్రకృతి సంపదను నిబంధనలకు విరుద్ధంగా తరలించుకుపోతున్నారు. అర్ధరాత్రి పూట పక్కాగా స్కెచ్ వేసుకుని ఈ అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ఆలమూరు మండలంలోని ఒక ఎంపీటీసీ సహకారంతో భారీ ఎత్తున వాహనాలను మోహరించి మరీ మట్టి, ఇసుక దోపిడీకి తెరతీస్తున్నారంటే వ్యవస్థలపై వారి ఒత్తిడి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కడియం మండలం పొట్టిలంక గ్రామం పరిధిలోని గోదావరి ఆనుకుని ఉన్న భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అటు బడుగువానిలంక, ఇటు పొట్టిలంక గ్రామాలకు చెందిన పలువురు రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి సమాచారం ఇస్తున్నారు. అయితే వారొచ్చేసరికి అక్రమార్కులు వాహనాలను మాయం చేస్తుండడం గమనార్హం. ఏడు లారీలు, రెండు జేసీబీలతో శుక్రవారం అర్ధరాత్రి తవ్వకాలు సాగించారని స్థానికులు చెబుతున్నారు. అలాగే శనివారం రాత్రి సైతం ఇదే స్థాయి వాహనాలతో మట్టి, ఇసుక తరలింపున కొనసాగిస్తున్నారని చెబుతున్నారు.

నదీ గర్భంలో అక్రమ తవ్వకాలు

గోదావరి సహజ ప్రవాహమార్గాన్ని ఇసుక, మట్టి మేటలు నియంత్రిస్తుంటాయి. అయితే అక్రమార్కులు వీటిని తవ్వేసి తరలించుకుపోతుండడంతో దిగువ ప్రాంతాల్లోని లంక భూములు గోదావరి ప్రవాహపు కోతకు గురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. మట్టి, ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు సాగించడంతో దిగువన ఉన్న రైతులు దెబ్బతింటున్నారంటున్నారు. అంతే కాకుండా రాత్రి పూట ఇష్టారీతిన వాహనాలతో ఈ రవాణా కొనసాగుతోందని, మార్గం వెంబడి పంటలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. అన్ని అనుమతులు ఉంటే పగటిపూటే రవాణా చేసుకోవచ్చని, అక్రమంగా తవ్వుతున్నారు కాబట్టే రాత్రి వేళ రవాణా చేస్తున్నారని రైతులు అంటున్నారు. కాగా రెండు నియోజకవర్గాలకు సరిహద్దుల్లో ఉండడంతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం దృష్టి సారించడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ అక్రమ రవాణాను తక్షణం అడ్డుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పలువురికి మాజీ మంత్రి వేణు పరామర్శ



బుర్రిలంకలో సత్యనారాయణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి వేణు

కడియం: మండలంలోని పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకులు గట్టి సత్యనారాయణమూర్తికి నివాళులర్పించారు. బుర్రిలంకలోని ఆయన స్వగృహానికి వెళ్లి పుష్పాంజలి ఘటించారు. అలాగే తూపాటి పద్మ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు నక్కా రాజబాబు, తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీను, సాపిరెడ్డి సూరిబాబు, రత్నం కృష్ణ తదితరులు ఉన్నారు.

సంస్కరణల యోధుడు జగ్జీవన్‌రామ్

- మాజీ మంత్రి వేణు
- ఘనంగా బాబూజీ జయంతి
- చర్చిపేట సెంటర్‌లో మాజీ ఎంపీ భరత్‌రామ్ నివాళి



బాబూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక సంస్కరణలను తీసుకువచ్చిన మహోన్నతుడు మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కొనియాడారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో శనివారం బాబూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ 27 ఏళ్ల శాసన సభ్యుడిగా, 30 ఏళ్ల కేంద్ర మంత్రిగా ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, రూరల్ నియోజకవర్గ ఎస్సీ అధ్యక్షుడు చీకురుమిల్లి చిన్న, రూరల్ మహిళా అధ్యక్షురాలు అంగాడ సత్యప్రియ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, పసలపూడి శ్రీనివాస్, చాప రాజా, నక్కా రాజేంద్ర, ఓడూరి రాంకీ, దారపు రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి

రాజమహేంద్రవరంసిటీ: సుదీర్ఘ కాలం పార్లమెంట్ సభ్యుడిగా, వివిధ మంత్రిత్వ శాఖలు నిర్వహించడంతో పాటు ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. చర్చిపేట సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ దొండపాటి క్రిష్టాఫర్ ఆధ్వర్యంలో ఇక్కడ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు మనమంతా కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. పిల్లలకు గొప్ప ఏదైనా ఇస్తున్నామంటే అది చదువొక్కటే అని మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తరచూ చెబుతూ ఉంటారన్నారు. జగన్ హయాంలో విద్యార్థులకు ఎన్నో పథకాలు అమలుచేశారని, ఇప్పుడు ఆ పరిస్థితులు కన్పించడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఏపీహెచ్‌బీసీ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, నక్కా శ్రీనగేష్, కాటం రజనీకాంత్, తిరగాటి దుర్గారావు, పీరా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం సిటీ: దేశ అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బాబూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం

కంబాలచెరువు: బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకమని అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. చెంచిరెడ్డి మాట్లాడుతూ మనందరం బడుగువర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయాలని, జగ్జీవన్ రామ్ ఆశించిన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీలు బి.రామకృష్ణ, రవికుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన నేత బాబూ జగ్జీవన్‌రామ్ అని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. కోటగుమ్మం వద్ద గల మండల విద్యాశాఖ కార్యాలయంలో బాబూజీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డీఐ కార్యాలయ సిబ్బంది పద్మావతి, సీఆర్‌ఎంటీ జయంతిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిదాయకమైన నాయకుడని పలువురు పేర్కొన్నారు. ఆయన జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. కడియం బొబ్బిలి బ్రిడ్జి సెంటర్‌లో కొల్లి రవలిన్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. వెంకటేశ్వరరావు, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, బీజేపీ నాయకులు బొర్సు సుబ్రహ్మణ్యం, గుత్తుల హరిప్రసాద్ తదితరులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు.

- జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. జగజ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుమాక షాలేమురాజు, డి. జయరాజు, గంటి స్వామిప్రసాద్, శాకా కిరణ్‌కుమార్, పెనుమాక జియాన్ పాల్గొన్నారు.
- దామిరెడ్డిపల్లిలో బాబూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. స్థానిక నాయకులు ముద్రగడ జెమి, విత్తనాల సాయి, రంపం గోపాలకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు చింతపర్తి నాగేశ్వరరావు, గంగరాజు, రాంబాబు, అన్నవరం, చిట్టిబాబు, రత్నం, ఇస్సాకు, మధు పాల్గొన్నారు.
- దుళ్లలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
- అరుంధతీపేటలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి కాంగ్రెస్ రూరల్ కో ఆర్డినేటర్ తాడాల కొండ్రాజు పూలమాల వేశారు.



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏఎస్పీ చెంచిరెడ్డి



జేగురుపాడులో పుష్పాంజలి ఘటిస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్



కడియంలో పూలమాల వేస్తున్న గిరజాల వీర్రాజు